గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, మార్చి 10 : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నారాయణగిరి నుంచి దేశ్‌ముఖి రోడ్, ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి మోడల్ స్కూల్ వరకు, జగత్‌పల్లి నుంచి జంగంవారిగూడెం వరకు, అబ్దుల్‌నగర్ నుంచి రుద్రవెల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 47మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. పోచంపల్లి పెద్ద చెరువు కట్టపై మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూదాన్ పోచంపల్లిలో రూ.9.76 కోట్లతో త్వరలో మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామని తెలిపారు. సుమారు రూ.500 కోట్లతో బునాదిగాని కాల్వ, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వల ఆధునీకరణ పనులు చేపట్టి 70వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన భూదాన్ పోచంపల్లిని మరింతగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, నాయకులు పాల్గొన్నారు.

కష్టంగా కాకుండా ఇష్టపడి చదువాలి

- ఎయిమ్స్ వార్షికోత్సవంలో ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జి.నాగేశ్వర్‌రెడ్డి

ఎయిమ్స్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

బీబీనగర్, మార్చి 10 : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువాలని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్, పద్మ విభూషణ్ డాక్టర్ జి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎయిమ్స్‌లో డైరెక్టర్ వికాస్ భాటియా ఆధ్వర్యంలో సోమవారం 5వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డి.నాగేశ్వర్‌రెడ్డి, గౌరవ అతిథి యూనిసెఫ్ హైదరాబాద్ సీఎఫ్ఓ డాక్టర్ జెలాలెం బి తఫేసే జ్యోతి ప్రజ్వలన చేసి ఎయిమ్స్ పురోగతిని వివరిస్తూ ఇన్ విక్టిస్ మ్యాగ్జిన్ విడుదల చేశారు. అనంతరం ఎంబీబీఎస్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందజేసి సన్మానించారు. ఐదో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రోగులతో మమేకమై వైద్య సేవలు అందించాలన్నారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో విద్యార్థులకు ఉన్న అకాంబిడేషన్ ఎక్కడా లేదని తెలిపారు. విద్యార్థులు ఏం కావాలనుకుంటున్నారో ముందుగా నిర్దేశించుకుని అందుకు తగినట్టుగా కష్టపడాలన్నారు. డాక్టర్ జెలాలెం బి తఫేసే మాట్లాడుతూ యూనిసెఫ్ ద్వారా ఎంతో మందికి సేవలందిస్తున్నామన్నారు. న్యూట్రిషన్ లేక ఆరు నెలల్లోపు పిల్లలు ఎంతో మంది మృతి చెందుతున్నారని తెలిపారు. కొవిడ్ సంక్షోభం తర్వాత అనేక మంది పిల్లలు ఆరోగ్యానికి, విద్యకు దూరమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో వస్తున్న సవాళ్లకు అనుగుణంగా వైద్య విద్యార్థులు పురోగతి చెందాలని సూచించారు. అంతకుముందు డైరెక్టర్ వికాస్ భాటియా ఎయిమ్స్ భవన నిర్మాణంలో పురోగతి, రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, ఎంబీబీఎస్, పీజీ వైద్య కళాశాల గురించి వివరించారు. ఓపీ ద్వారా 10 లక్షల మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డీన్ రాహుల్ నారంగ్, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా, డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ వర్గీస్, డాక్టర్లు మృధుల, లక్కిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగారూ.. మీ కార్యకర్తలకు సంస్కారం నేర్పండి

- మహేంద్ర యువసేన మండలాధ్యక్షుడు రాజు

సమావేశంలో మాట్లాడుతున్న రాజు

రాజాపేట, మార్చి 10 : ఆలేరు ఎమ్మెల్యేగారూ.. మీ పార్టీ కార్యకర్తలకు పద్ధతిగా మాట్లాడే సంస్కారం నేర్పించాలని మహేంద్ర యువసేన మండలాధ్యక్షుడు బిల్లకుదురు రాజు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంలో ప్రొటోకాల్ ఉల్లంఘించిందిగాక.. గొంగిడి మహేందర్‌రెడ్డిని విమర్శించడం తగదన్నారు. ఎమ్మెల్యే ఐలయ్యకు దమ్ముంటే మాట్లాడాలని, రాజకీయ జ్ఞానం లేని పోరగాళ్లతో మాట్లాడించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహేందర్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సమావేశంలో మోత్కుపల్లి బాలకృష్ణ, వరిమడ్ల బాలకృష్ణ, భూక్య శ్రీను పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమలతో నష్టపోతున్నామని కలెక్టర్‌కు వినతి

చౌటుప్పల్, మార్చి 10 : మున్సిపాలిటీ పరిధి లింగోజిగూడెం గ్రామ సమీపంలోని దివీస్, ఇతర రసాయన పరిశ్రమల వల్ల వ్యవసాయదారులు, గీత కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని తాళ్లసింగారం గ్రామానికి చెందిన బొంగు చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ పరిశ్రమలు వెదజల్లుతున్న రసాయనాలతో భూగర్భజలాలు కలుషితం కావడంతో ఇక్కడ పండిన పంటలు తినలేక పోతున్నారని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మూసీ కాల్వకు గండి కొట్టి ఓ పరిశ్రమ యాజమాన్యం నీటిని తరలించుకుపోతున్నదని పేర్కొన్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డుకు అడ్డంగా మూసీ పైపులైన్ తవ్వి రాకపోకలను బ్లాక్ చేసి సమీప ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చంద్రశేఖర్ కోరారు.

కేజీబీవీ పాఠశాలలో స్వీపర్ పోస్టుకు దరఖాస్తులు

బొమ్మలరామారం, మార్చి 10 : మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన స్వీపర్ పోస్టు భర్తీ చేయుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ రోజారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి ఉత్తీర్ణత సాధించిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు తగిన ధ్రువపత్రాలతో 12న సాయంత్రం 5గంటల్లోపు కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఇసుక రవాణా అరికట్టాలని వినతి

రాజాపేట, మార్చి 10 : మండలంలోని బేగంపేట వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణాను అరికట్టాలని కలెక్టర్ హనుమంతరావుకు సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేణికుంట, బేగంపేట, గంధమల్ల గ్రామాలకు చెందిన కొంతమంది ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మూల పోచయ్య, హరినాథ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామన్నపేట, మార్చి 10 : మండలంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం సివిల్ సప్లయ్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించి 116బస్తాల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. మండల కేంద్రంలోని లక్ష్మాపురం వెళ్లే రోడ్డులో పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఓ రైస్ మిల్లులో నిల్వ ఉన్న 8బస్తాలు, వేర్వేరు అటోల్లో ఆరు బస్తాలు, ఓ ఇంట్లో 102 బస్తాల బియ్యం పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యం సుమారు 50క్వింటాళ్లపైనే ఉంటుందని అధికారులు తెలిపారు. డిప్యూటీ తాసీల్దార్ బి.బాలమణి పంచనామా నిర్వహించి పట్టుబడిన బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో అధికారులు బి.అంజయ్య, ఎన్.యాదయ్య పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయానికి రూ.2లక్షల విరాళం

మోత్కూరు, మార్చి 10 : మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురంలో సీతారామచంద్రస్వామి ఆలయం మెట్ల నిర్మాణానికి పల్లెర్ల కళ్యాణి – వెంకన్న దంపతులు రూ.2లక్షల విరాళం అంద చేశారు. సోమవారం ఆలయం మెట్ల నిర్మాణం పనులను ప్రారంభించారు. దాత వెంకన్న తల్లిదండ్రులు సరస్వతి – రంగయ్య జ్ఞాపకార్థం విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దబ్బెటి విజయారమేశ్, నాయకులు పైళ్ల సోమిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌కు ఆశీర్వచనం ఇస్తే
ఆలయ ఈఓకు ఎందుకు అక్కసు?

- స్వామివారి కల్యాణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీకి అవమానం
- కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా మారిన దేవస్థానం
- విమాన గోపురానికి వచ్చిన విరాళాల లెక్క తేల్చాలి
- ఆలయ ఈఓను నిలదీసిన డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

ఆలయ ఈఓ భాస్కర్‌రావును నిలదీస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, మార్చి 10 : యాదగిరిగుట్ట రూపశిల్పి, మాజీ సీఎం కేసీఆర్‌కు అర్చకులు వేద శీర్వచనం చేస్తే ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు ఎందుకు ఇంత అక్కసు అని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ప్రశ్నించారు. బ్రహ్మోత్సవాలకు మాజీ సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించాలని, ఆయనను గౌరవించుకోవాలని దేవస్థానంపై ఉందని చినజీయర్ స్వామి చెప్పే వరకు ఆయనను ఆహ్వానించాలన్న ఆలోచన గుట్ట ఈఓకు లేకపోవడం శోచనీయమన్నారు. ఆహ్వాన పత్రికను అందజేసేందుకు ఈఓ ఎందుకు వెళ్లలేదో చెప్పలేకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఆహ్వానించే క్రమంలో అర్చకులను గౌరవించి వారికి కేసీఆర్ సాష్టాంగ నమస్కారాలు చేశారని, ఈ క్రమంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేసి ఆహ్వాన పత్రిక అందజేశారని తెలిపారు. కానీ.. కేసీఆర్‌కు ఎందుకు ఆశీర్వచనం చేశారంటూ ఈఓ భాస్కర్‌రావు అర్చకులపై దర్భాషలాడారని అన్నారు. యాదగిరికొండపై సోమవారం గొంగిడి మహేందర్‌రెడ్డితోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఈఓ భాస్కర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈఓను నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నావని మండిపడ్డారు. గత శనివారం స్వామివారి బ్రహ్మోత్సవ కల్యాణంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డిని వెనుక కుర్చీలో కూర్చోబెట్టి ప్రొటోకాల్ పాటించకుండా అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 15 నెలల కాలంలో యాదగిరిగుట్ట దేవస్థానంలో జరుగుతున్న సంఘటనలు యావత్ రాష్ట్ర భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ దంపతులు ఇస్తారని అన్నారు. కానీ.. ఈసారి మంత్రులు రాకపోవడం స్వామివారిని అవమానపరిచినట్లేనని చెప్పారు. ఎలాంటి అర్హత, ప్రభుత్వ హోదాలేని ఎమ్మెల్యే అన్న బీర్ల శంకర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఈరసరపు యాదగిరిగౌడ్ ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. రూ.70 లక్షలతో బంగారు రథాన్ని ఆలయానికి విరాళంగా ఇచ్చిన శ్రీలోగిళ్లు డెవలపర్స్ సంస్థ యాజమాన్యానికి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక అందించకుండా అవమానపరిచారని తెలిపారు. దేవస్థానం అభివృద్ధిలో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం దివ్య విమాన గోపురం స్వర్ణమయం చేయాలని సంకల్పించిందని, తాపడం పనులను ఈఓ ఒక్కరే బాధ్యత తీసుకుని మిగతా అధికారుల ప్రమేయం లేకుండానే పనులు పూర్తి చేయడంలో అనుమానాలకు తావిస్తుందని విమర్శించారు. గతంలో పలుమార్లు బంగారు విరాళాలకు సంబంధించిన లెక్కలను చెప్పాలని కోరినా పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొండపైన సుమారు వంద మంది యువకులకు సురక్షా కాంట్రాక్టు కింద ఉద్యోగాలిస్తే.. వారిలో కొంత మందిని ఈఓ అకారణంగా తొలగించారని తెలిపారు. యాదగిరిగుట్ట పవిత్రతను కాపాడే ఈఓ భాస్కర్‌రావు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల ఒత్తిడితో ఆలయాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా మార్చారని ఆరోపించారు.

ఈఓ తీరుపై దేవస్థాన ఉద్యోగులు, అర్చకులు అసహనంగా ఉన్నారని గుర్తు చేశారు. ప్రొటోకాల్ పాటిస్తూ దేవస్థాన అభివృద్ధికి కట్టుబడి ఉండాలని, పార్టీలకతీతంగా ప్రతి ఒక్క ప్రజాప్రతినిధిని, దాతలను గౌరవించాలని సూచించారు. ఇలాగే కొనసాగితే బీఆర్ఎస్ పార్టీ తరపున ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ పార్టీ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంటకయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు కసావు శ్రీనివాస్‌గౌడ్, వంటేరు సురేశ్‌రెడ్డి, ముక్కర్ల సతీశ్, భీమగాని నర్సింహ, బబ్బూరి వెంకటేశ్, ఆవుల సాయి, పేరబోయిన సత్యనారాయణ ఉన్నారు.

జాతీయ వ్యవసాయ మార్కెట్ ముసాయిదాను రద్దు చేయాలి

- కలెక్టరేట్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ధర్నా

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 12 : కేంద్ర ప్రభుత్వం గతంలో రద్దు చేసిన మూడు చట్టాల స్థానంలో జాతీయ వ్యవసాయ మార్కెట్ ముసాయిదాను తీసుకొచ్చిందని, దీనిని రద్దు చేసే వరకు ఐక్యంగా పోరాడుతామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జిల్లా కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్‌కేఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 నవంబర్ 24న విడుదల చేసిన జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఎన్‌పీఎఫ్ఎం) ముసాయిదాపై వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను కోరిందన్నారు. ఈ ముసాయిదా వల్ల గతంలో రద్దయిన చట్టాలను మార్కెట్ విధానాల రూపంలో రైతులపై రుద్దే ప్రయత్నం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రైతుల కోసం కాకుండా, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన విధానమని అన్నారు. దేశ రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ద్వారా కనీస మద్దతు ధరకు (ఎంఎస్‌పీ) చట్టబద్ధత హామీ ఇవ్వడంలో స్పష్టత లేకపోవడం రైతుల భద్రతకు ప్రధాన అడ్డంకిగా మారిందన్నారు. రైతుల ఆదాయ భద్రతపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఇది చిన్న రైతులను ఇంకా అస్థిరత లోకి నెట్టివేస్తుందన్నారు. కేంద్రం కాంట్రాక్ట్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ ముసాయిదాను విరమించుకొని దీని స్థానంలో రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు మాటూరి బాలరాజు, మామిడాల భిక్షపతి, మంగ నర్సింహులు, కామెడీ ఉప్పలయ్య, కళ్లెం అడివయ్య, ఉప్పల కొమురయ్య, జక్కు దయాకర్‌రెడ్డి, ఆంజనేయులు, బబ్బురి పోశెట్టి, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, బెజాడి కుమార్, ఏశాల అశోక్, సోమన ఐలయ్య, రాజయ్య, సోమయ్య, అంజిబాబు, లక్ష్మయ్య, అంజిరెడ్డి, రమేశ్, భాస్కర్, మల్లేశ్, కొమురయ్య పాల్గొన్నారు.

బైకులు ఢీకొని ఇద్దరు దుర్మరణం

మహేశ్ (ఫైల్)

శంకర్ (ఫైల్)

గుండాల, మార్చి 10 : మండలంలో ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వంగాల గ్రామానికి చెందిన చిప్పలపల్లి శంకర్ గుండాల నుంచి వంగాలకు బైక్‌పై వస్తున్నాడు. వస్తాకొండూర్ గ్రామానికి చెందిన సుంకరబోయిన మహేశ్ గుండాలకు బైక్‌పై వెళ్తున్నాడు. పాచిల్ల గ్రామం వద్ద ఇరువురి బైకులు అధిక వేగంతో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దాంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు, పోలీసులు 108 అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మహేశ్(35) మార్గమధ్యలో మృతిచెందాడు. శంకర్(39) పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నర్సింహ (ఫైల్)

భువనగిరి కలెక్టరేట్, మార్చి 10 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన పిన్నం నర్సింహ (63)కు జిన్న బాలరాజు, పిన్నం పెద్ద కనకరాజుతో మూడు రోజులుగా వ్యవసాయ బావి వద్ద పైపులైన్ విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి పిన్నం నర్సింహ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య పద్మ వెళ్లిచూడగా స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో 108 సిబ్బంది వచ్చి చూసి నర్సింహ మృతిచెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం సోమవారం మృతదేహాన్ని జిన్న బాలరాజు ఇంటి వద్ద వేసి నర్సింహ కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ఆందోళనను విరమింపజేశారు. నర్సింహ మృతికి బాలరాజు, కనకరాజు కారణమని మృతుడి కుమార్తె బర్ల మానస పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ సీఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ

ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 10 : ముస్త్యాలపల్లి – మోటకొండూర్ గ్రామాల మధ్య బీటీ రోడ్డు ఏర్పాటు చేసి, గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాటలో భాగంగా మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలో సోమవారం సమస్యలను అధ్యయనం చేసి మాట్లాడారు. పేదల ఇండ్ల పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించాలన్నారు. మోటకొండూరు రోడ్డు కంకర వేసి 15 సంవత్సరాలు అవుతున్నా పట్టించుకునే నాథుడు లేడని విమర్శించారు. దరఖాస్తులు చేసుకొని ఎదురు చూస్తున్న అర్హులందరికీ వెంటనే రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న తాసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, శాఖ కార్యదర్శి కళ్లెం లక్ష్మీనర్సయ్య, నాయకులు స్వామి, కుమార్, లక్ష్మయ్య, నాగరాజు, రామచంద్రం, వెంకటేశ్, మల్లేశ్, శ్రీను, యాదగిరి, గణేశ్ పాల్గొన్నారు.

'రామన్నపేటను నియోజకవర్గ కేంద్రంగా పునరుద్ధరించాలి'

పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట, మార్చి 10 : రామన్నపేటను నియోజకవర్గ కేంద్రంగా పునరుద్ధరించి పూర్వ వైభవం తీసుకురావాలని సీపీఎం జిల్లా నాయకులు మేక అశోక్‌రెడ్డి, జెల్లెల పెంటయ్య అన్నారు. ఈ నెల 23నుంచి 28వరకు నిర్వహించే ప్రజా చైతన్య యాత్ర పోస్టర్‌ను మండల కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాటాడారు. ప్రజా సమస్యల పరిష్కారం, మండల సమగ్రాభివృద్ధి కోసం 24 గ్రామాల్లో ఆరు రోజుల పాటు 132 కిలోమీటర్ల పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలను తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం చివరి రోజు తాసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజలతో కలిసి ఆందోళన చేపడుతామన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు వసం ఉపేందర్, బల్గూరి అంజయ్య, బోయిని ఆనంద్, కందుల హన్మంతు, విజయ్‌భాస్కర్, గొరిగె సోములు, బొడిగె రజిత, వేముల సైదులు పాల్గొన్నారు.

ఇండ్ల నిర్మాణ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 10 : అక్రమాలకు తావు లేకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియను పారదర్శకంగా వేగవంతంగా పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో ఆర్డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపికైన గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామాల్లో ఎంపికైన ఇండ్లకు మార్కింగ్ వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపికైన గ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. లబ్ధిదారులు ఎంపిక త్వరగా పూర్తి చేయాలన్నారు. మిగిలిన అన్ని గ్రామాల్లోని ఇండ్లకు సంబంధించిన వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి నివేదిక సమర్పించాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ శోభారాణి, రెవెన్యూ డివిజనల్ అధికారులు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, హౌజింగ్ పీడీ విజయసింగ్, హౌజింగ్ డిప్యూటీ ఈఈలు టి.నాగేశ్వర్‌రావు, ఎం.శ్రీరాములు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ వ